క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి రాజ్‌కుమార్

ఏన్కూరు: చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల ఎన్నికల అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రోజు ఎన్ని వాహనాలు తనిఖీ చేస్తున్నారు, వాటి నంబర్లను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత నగదు పట్టుకున్నారు.. తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించిన అధికారి

మధిర: మధిర ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని శుక్రవారం సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఐఏఎస్ అధికారి కానారామ్ సందర్శించారు. నామినేషన్లు దాఖలైన వివరాలను రిటర్నింగ్ అధికారి గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణకు సంబంధించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందుగా ఆయనకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా పూలమొక్క అందజేశారు.

కాంగ్రెస్‌దే అధికారం

వైరా: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు అన్నారు. వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోత్ రాందాస్ నాయక్ శుక్రవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వైరాలో భారీ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్, జైపాల్, రామారావు, వెంకటేశ్వరరావు, రంగారావు, టీడీపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

క్యాట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

మధిరరూరల్: గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్) ప్రవేశ పరీక్షల్లో మధిర శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ భారతి మాట్లాడుతూ.. సబ్జెక్టుల వారీగా మాథ్స్ 17 మంది, ఫిజిక్స్ 18, కెమిస్ట్రీ 22 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కుటుంబాలకు 'బీమా' భరోసా

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సభ్యుల కుటుంబాలకు భరోసాగా నిలిచే కార్యక్రమాన్ని పార్టీ అధినేత కేసీఆర్ ఏర్పాటు చేశారని ఎంపీటీసీ పాలకుర్తి సునీత అన్నారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత కడారి ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడు పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2లక్షల చెక్కును ఎంపీటీసీ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి తెలంగాణ మేనిఫెస్టోను అందించారు. కార్యక్రమంలో అప్పారావు, రాజు, చిన్న నర్సింహారావు, అశోక్, నాగేశ్వరరావు, నరేంద్ర, పుల్లయ్య, ముత్తయ్య, మాధవరావు, వెంకట్ పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో 'జస్ట్ ఏ మినిట్' కార్యక్రమం

సత్తుపల్లిరూరల్: జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ సెల్, టీఎస్ కేపీ సంయుక్త ఆధ్వర్యంలో యూని గ్రాండ్ ఓవర్ సీస్ కన్సల్టెన్సీ వారితో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై జస్ట్ ఏ మినిట్ అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యానికి గాను కన్సెల్టెన్సీ వారు ప్రశంసలతో పాటు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ సెల్ కన్వీనర్ సీహెచ్ శ్రీధర్, సభ్యులు ఎం.రాంబాబు, చెన్నారావు, శ్రీశాంత్, టీఎస్ కేపీ కన్వీనర్ డి.బండారి, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.రామచంద్రరావు, పీల్ సాహెబ్, శ్రీనివాస్, రవికుమార్, మధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడిగా కైలాష్ శర్మ

కారేపల్లి: కారేపల్లి, కామేపల్లి, గార్ల, రఘునాథపల్లి మండలాల విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులుగా కొత్తలంక కైలాష్ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కారేపల్లి శివాలయంలో జరిగిన సంఘం సమావేశంలో.. అధ్యక్షుడిగా కైలాష్ శర్మ, కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా సురేష్ శర్మ, కోశాధికారిగా మధుసూదనచారి, గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వరశర్మ, వెంకటశాస్త్రి, రామశర్మ, ప్రసాద్ శర్మ తదితరులను ఎన్నుకున్నారు.



కలశ దీపం



వాటర్ బేల్స్



లక్ష్మీ ప్రమిదలు



వినాయక ఆకారంలో..



బొమ్మల కొలువు కోసం..

దీపాల సందడి..!



సత్తుపల్లిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఓ వైపు దీపావళి.. మరోవైపు కార్తీక మాసం..

- విభిన్న ఆకృతులతో ప్రమిదలు
- సైజు, ఆకారాన్ని బట్టి ధరలు
- వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న వైనం
- కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ బిజీబిజీ

సత్తుపల్లిటౌన్: దీపావళి సందడి మొదలైంది. విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు, దీపపు దిమ్మెలు ఆకట్టుకుంటున్నాయి. ఏడాది కోసారి ప్రతి ఇంట్లోనూ దీపావళి వెలుగులు నింపుతోంది. ఈ పండుగను పురస్కరించుకొని ప్రమిదలు, బొమ్మలు కొనుగోళ్లతో సందడి నెలకొంది. ఇళ్ల ముందు దీపాలతో అలంకరించటం మన సంప్రదాయం.. ఎన్నిరకాల ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు అందుబాటులో ఉన్నా.. సాంప్రదాయంగా వస్తున్న ప్రమిదలను వెలిగించి ఇళ్ల ముందు దీపావళికి ముందు రోజు నుంచి నెలరోజుల పాటు కార్తీకమాసమంతా అందంగా అలంకరిస్తుంటారు. ఇంటింటా దీపావళి వెలుగులు విరజిమ్మేందుకు సత్తుపల్లి మార్కెట్‌కు ప్రమిదలు వచ్చేశాయ్.. దీపావళితో పాటు కార్తీకమాసం ఉండటంతో పూజలకు ప్రమిదలను ఎక్కువగా ఉపయోగిస్తారు.

విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు..

ఈ నెల 13వ తేదీన సోమవారం దీపావళి పర్వదినం కావటంతో ప్రమిదల అమ్మకాలు జోరందుకున్నాయి. పట్టణంలోని రింగ్‌సెంటర్, పాతసెంటర్, వేంసూరురోడ్, సిద్ధారంరోడ్‌లతో పాటు సైకిళ్లు, బుట్టల్లో పెట్టుకొని వీధుల్లో తిరుగుతూ ప్రమిదలను విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో పింగాని ప్రమిదలు కూడా వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా ఉన్నాయి. గోల్డ్ కలర్ లక్ష్మీదేవి కుందులు, సాధా కుందులు, కొబ్బరికాయ, తాబేలు, నెమలి, గణపతి, ఆకాశ దీపం కుందులు, 360 ఒత్తులు వెలిగించే కుందులు, నక్షత్రం, నాగపాము డిజైన్లలో ప్రమిదలు ఆకర్షణీయంగా ఉన్నాయి. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయిస్తున్న వివిధ రకాల డిజైన్, ఫ్యాన్సీ ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. దీపావళికి లక్ష్మీదేవి వ్రతాలను ఆచరించేందుకు వివిధ రూపాలలో లక్ష్మీదేవి ప్రతిమలు అందుబాటులో ఉన్నాయి.

డిజైన్ తగ్గట్టుగా ధరలు..

ప్రమిదల సైజు, ఆకారాన్ని బట్టి మార్కెట్‌లో విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రమిదల విక్రయాలు బాగా పెరిగాయి. వీటితో పాటు బొమ్మల కొలువు బొమ్మలను కూడా విక్రయిస్తున్నారు. డిజైన్ ఉన్న చిన్న ప్రమిదలు డజను రూ.35 నుంచి రూ.65 వరకు, చిమ్ని దీపాలు రూ.80, కలకత్తా దీపాలు రూ. 90, అఖండ దీపాలు రూ.30 మొదలు రూ.200ల వరకు, కలుషం ఆకాశ దీపాలు రూ.200, వాటర్ బెల్స్ రూ.300 నుంచి రూ.600 వరకు, ఏనుగు దీపాలు, తులసి కోటలు తదితరాలను విక్రయిస్తున్నారు.

30 ఏళ్లుగా విక్రయిస్తున్నాం..



దీపావళి పండుగ కోసం ప్రమిదలను తమిళనాడు నుంచి తెప్పించాం. రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టాం. గతంలో ఇళ్ల దగ్గరే తయారు చేసి విక్రయించాం. ప్రజలు ఆకర్షణీయమైన డిజైన్ల ప్రమిదలకు మొగ్గు చూపుతున్నారు. పండుగకు మూడురోజుల ముందు నుంచే అమ్మకాలు సాగిస్తున్నాం.

– ఎం.జయమ్మ, సత్తుపల్లి

కారు గుర్తుకు ఓటు వేయాలి

కల్లూరురూరల్: బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా కల్లూరులోని ముస్లిం పెద్ద సులేమాన్ ఖాన్ వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా బత్తుల పల్లిలో అనారోగ్యంతో ఉన్న జంగా వెంకటరెడ్డిని పరామర్శించారు. గోపాల దేవబోయిన పల్లిలో రైతులను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే..

తల్లాడ: మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామంలోని రాంబాబు గృహంలో శుక్రవారం జరిగిన హనుమాన్ చాలీసా పూజా కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, భద్రరాజు, వెంకట్‌లాల్, నరేష్, శ్రీను, బాబు పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసా పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించండి



మట్టా రాగమయి, దయానంద్ దంపతులకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న సత్యనారాయణ, మంజుల

సత్తుపల్లిటౌన్: మీ ఇంటి ఆడబిడ్డగా వస్తున్నానని తనను ఆశీర్వదించి ఆదరించాలని సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మట్టా రగమయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి, స్థానిక వ్యాపారవేత్త వందనపు సత్యనారాయణ నివాసం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్, రాగమయి దంపతులకు వేద ఆశీర్వచనం అందించి నూతన వస్త్రాలు బహుకరించారు. అనంతరం రామానగరం గ్రామంలో గ్రామస్తులు ఆడబిడ్డగా గౌరవించి రూ.60వేల నగదును అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, గ్రాండ్ మౌలాలీ, రఫీ, ప్రభాకర్‌రావు, కమల్‌పాషా, ప్రసాద్, కృష్ణారెడ్డి, చారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలు ప్రజల్లోకి తేవాలి..

కల్లూరు/కల్లూరురూరల్: కాంగ్రెస్ పథకాలు ప్రజల్లోకి తీసుకురావాలని మట్టా దయానంద్ అన్నారు. సంభాని వర్గీయుల సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించి మాట్లాడారు. మనోధైర్యం కోల్పోకుండా కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలో ఏర్పాట చేసిన సంయుక్త సమావేశంలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సత్తుపల్లి అభ్యర్థి మట్టారాగమయికి టీడీపీ మద్దతు పలికింది. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టా దయానంద్ నున్నా రామకృష్ణ, ప్రభాకర్‌రావు, పసుమర్తి చందర్‌రావు, షేక్.యాఖుబ్‌అలీ, కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనివాసరావు, పోట్రు శ్రీనివాసరావు, మాజీ ఆత్మాకమిటీ చైర్మన్ నున్నా రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, పసుమర్తి చందర్‌రావు, ఎస్‌కే యాకూబ్ అలీ, కృష్ణారెడ్డి, రాజు, నాయకులు చిట్టిబాబు, విజయదాసు, కట్టా గోపాలరావు, వెంకటేశ్వరావు, శ్రీనివాసరావు, బి.భాస్కర్‌రావు, మధు, భాస్కర్‌రావు, రామారావు, ఆంజనేయరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

కారేపల్లి: మండలంలోని కొత్తూరుతండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ దయామని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలోని పిల్లలకు అందించే పోషకాహారం పాలు, గుడ్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బాలింతలు, పిల్లలు, గర్భిణులు అంగన్‌వాడీకి రాకపోయినా.. వారికి కూడా రేషన్ తీసిందని, 77 గుడ్లు ఉండాల్సి ఉండగా 109 గడ్లు ఉన్నాయని, 7 లీటర్ల పాలు తీయాల్సి ఉండగా 11 లీటర్ల పాలు తీశారని తెలిపారు. స్టాక్ ఎందుకు ఎక్కువ తీశారని అడుగగా.. టీచర్ ఎటువంటి సమాధానం తెలపలేదని సీడీపీఓ పేర్కొన్నారు. అదే విధంగా గత ఆరె నెలలుగా అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ రిజిస్టర్‌లో ఎలాంటి సమాచారం పొందుపరచకపోవడం, అంగన్‌వాడీ టీచర్ యూనిఫామ్ ధరించకపోవడం, ఆయా సైతం విధులకు రాకుండా, ఆమె కుమార్తెను ఎలాంటి అనుమతులు లేకుండా విధులు చేపట్టడం వంటి విషయాలపై సదరు అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు ఆమె నోటీసులు జారీ చేశారు. దీంతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభద్ర పర్యవేక్షణ సరిగా లేదని, ఆమెకు సైతం నోటీసులు జారీ చేశారు.

'విజయ'లో ఓటు హక్కుపై అవగాహన

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రచారం సందర్భంగా ఎక్కడైనా అవినీతి, డబ్బు పంపిణీ తదితర అంశాలు దృష్టికి వస్తే తక్షణమే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా అటానమస్ రోబోటిక్ వెహికిల్స్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై కిట్స్ కార్ప్స్ వారి సహకారంలో సీఈసీ విద్యార్థులకు నిర్వహించిన రోబోటిక్స్ వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రయాన్ మిషన్, అడ్వాన్స్ డ్ ఏటీఎం తదితర విషయాలపై నమూనా రోబోలను ప్రదర్శించారు. సీఈసీ హెచ్ఓడీ డాక్టర్ ఆయేషా తరుణమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిట్స్ కార్ప్స్ రిసోర్స్ పర్సన్ జి సూర్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను వీడేది లేదు

కల్లూరు: ఎవరు ఏ పార్టీలోకి మారినా మేము మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడేదే లేదని సంభాని వర్గీయులు స్పష్టం చేశారు. శుక్రవారం లక్కినేని రమేష్ గృహంలో సంభాని వర్గీయులు సమావేశమయ్యారు. సత్తుపల్లి నియోజకవర్గానికి టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పార్టీ మారడం సరికాదని.. ఇక్కడ పార్టీనే ముఖ్యమని వ్యక్తులు కాదని అన్నారు.

సబ్సిడీపై ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ

తల్లాడ: మండలంలో ప్రభుత్వం సబ్సిడీపై ఎల్ఈడీ బల్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. గత 3 నెలల్లో ఏదైనా కరెంట్ బిల్లును చూపించి 5 ఎల్ఈడీ బల్బులను 3 సంవత్సరాల వారంటీతో ఒక్కో బల్బుకు కేవలం 25 రూపాయలకే ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

కొణిజర్ల: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్(షటిల్) పోటీలకు పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సవళ్ల శృతి ఎంపికైనట్లు హెచ్ఎం మార్క్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శృతి ఆడనుంది. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థిని పీఈటీ రంజాన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తుపల్లి విద్యార్థులు..

సత్తుపల్లిరూరల్: ఖమ్మంజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పటేల్ స్టేడియంలో జరిగిన అండర్-14, అండర్-17 సంవత్సరాల బాల బాలికల స్కూల్ గేమ్స్ కరాటే పోటీల ఎంపికలు జరిగాయి. అందులో భాగంగా 14 సంవత్సరాలలోపు బాలికల కుమిటీ ఈవెంట్‌లో డి.సాయి విశిష్ట(శ్రీచైతన్య స్కూల్), బాలుర కుమిటీ విభాగంలో జి.ఉదయ్‌కుమార్(విశ్వశాంతి స్కూల్) ఎంపికైనట్లు కరాటే మాస్టర్, జిల్లా కార్యదర్శి వి.పిచ్చయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెలలో నల్గొండలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట, రంగంబంజర, మల్సూర్‌తండా, నారాయ్యబంజర, లక్ష్మీపురం , పినపాక, వెంకటాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

సత్తుపల్లి నియోజకవర్గంలో.. 28 మంది అభ్యర్థులు.. 41 సెట్ల నామినేషన్లు

సత్తుపల్లి: సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ల ముగిసే సమయానికి 28 మంది అభ్యర్థులు.. 41 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. చివరిరోజు శుక్రవారం 15 మంది నామినేషన్లన్లు వేశారు. వీరిలో అత్యధికులు రెండోసారి నామినేషన్లు దాఖలు చేసినవారే ఉన్నారు.

రెబల్స్ బెడద లేదు..

ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు రెబల్స్ బెడద లేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశించిన నేతలు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. సండ్ర వెంకటవీరయ్య(బీఆర్‌ఎస్), మట్టా రాగమయి(కాంగ్రెస్), నంబూరి రామలింగేశ్వరరావు(బీజేపీ), శీలం వెంకటేశ్వరరావు(బీఎస్పీ), మాచర్ల భారతి(సీపీఎం), బీరెల్లి లాజర్(సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా)లతో పాటు మరో 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల నుంచి డమ్మీ అభ్యర్థులుగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్(కాంగ్రెస్), నంబూరి శిరీష(బీజేపీ), కొలికపోగు సర్వేశ్వరరావు(సీపీఎం)లు నామినేషన్లు దాఖలు చేయటం విశేషం.

వైరా నియోజకవర్గంలో.. 16 మంది అభ్యర్థులు.. 23 సెట్ల నామినేషన్లు

వైరా: వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం నామినేషన్ల ఘట్టం ముగిసేటప్పటికీ మొత్తం 16 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారి బి.సత్యప్రసాద్ కు అందజేశారు. శుక్రవారం ఒక్కరోజే పది సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ బానోత్ మదన్‌లాల్ అత్యధికంగా మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్, బీఎస్పీ అభ్యర్థి బానోత్ రాంబాబు, ఇండిపెండెంట్లు గుగులోత్ తావుర్యా, వర్షా రాములు, అలయెన్స్‌డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థి మాళోత్ శ్యాంలాల్‌నాయక్ రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. గుగులోత్ భావ్‌సింగ్ (ఇండి), బానోత్ దుర్గా ప్రసాద్ (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), తేజావత్ సంపత్‌కుమార్ (జనసేన), సునావత్ వీరన్న(సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ), ధరావత్ రామ్మూర్తి (ఇండిపెండెంట్), భూక్యా వీరభద్రం (సీపీఐ (ఎం)), వజ్జా రామారావు(సీపీఎం), లకావత్ గిరిబాబు (ఇండిపెండెంట్), ధనసరి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి శ్రీనులు (గోండ్వానా దండకారణ్య పార్టీ)లు ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 16 మంది 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



వైరా: నామినేషన్ అందజేస్తున్న సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం

మధిర నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులు.. 33 సెట్లు

మధిర: నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మధిర అసెంబ్లీ స్థానానికి మొత్తలం 22 మంది అభ్యర్థులు 33 నామినేషన్లను దాఖలు చేశారు. చివరిరోజు 18 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లు భట్టి విక్రమార్క నామినేషన్ దాఖలు చేయగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా లింగాల కమల్‌రాజ్ నామినేషన్ వేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి రెబల్ అభ్యర్థిగా బొమ్మెర రామ్మూర్తి నామినేషన్ వేశారు. అదే విధంగా సీపీఎం అభ్యర్థిగా పాలడుగు భాస్కర్, బీజేపీ అభ్యర్థిగా పెరుమాళ్లపల్లి విజయ రాజు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా మండూరి శారద నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఎం అభ్యర్థికి డమ్మీగా మద్దాల ప్రభాకర్ నామినేషన్ వేశారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..

మధిర: ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలోని 78 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సీఎల్పీ నేత, కాంగ్రెస్ మధిర అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేసిన ఆయన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా స్విమర్స్ అసోసియేషన్, వాకర్స్ క్లబ్ సభ్యులను కలవడమే కాక, అంబేడ్కర్ సెంటర్ నుంచి రాయపట్నం సెంటర్, మెయిన్ రోడ్డులో వ్యాపారులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ నెల రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుండగా, కొత్త ప్రభుత్వంలో మధిర దశాదిశ నిర్దేశించేదిగా ఉండాలని ఆకాంక్షించారు. మధిర సమగ్రాభివృద్ధి తన ధ్యేయమని, ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పత్తి, మిర్చి, వరి, పసుపు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. నాయకులు డాక్టర్ కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, రంగా శ్రీనివాసరావు, కోనా ధని కుమార్, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పారుపల్లి విజయ్ కుమార్, తూమాటి నవీన్ రెడ్డి, అద్దంకి రవికుమార్, కోట డేవిడ్, దారా బాలరాజు, రామారావు, సందీప్ పాల్గొన్నారు.



వ్యాపారితో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ఒక్కసారి అవకాశమివ్వండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: వచ్చే ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, ములుగుమాడు, తక్కెళ్లపాడు, సఖినవీడు, మీనవోలు, పెద్దగోపవరం , ఎర్రుపాలెం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. రామన్నపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. సీఎల్పీ నేతగా పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని మల్లు భట్టి విక్రమార్క సీఎంగా చాన్స్ తనకే దక్కుతుందని చెప్పుకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు తనకే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, మధిర మార్కెట్ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ రామకృష్ణ, జెడ్పీటీసీ కవిత, సొసైటీ చైర్మన్లు మదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సాంబశివరావు, మధుసూధన్‌రెడ్డి, సర్పంచులు అప్పారావు, భాస్కరరెడ్డి, ఎంపీటీసీలు రామకోటేశ్వరరావు, మల్లిఖార్జున్‌రెడ్డి, కిశోర్, మస్తాన్‌వలీ, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు అరుణ, శ్రీనివాసరావు, రైతుబంధు మండల కన్వీనర్ బాలరాఘవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి విజయరాజును గెలిపించండి

మధిర: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, నియోజకవర్గ ప్రజలు జనసేన బలపరిచిన బీజేపీ అభ్యర్థి విజయరాజును గెలిపిస్తే ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంచుతామని కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మధిర ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనతో విసుగు చెందారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు మొత్తం కేంద్ర ప్రభుత్వం నిధులతో మాత్రమే జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదన్నారు. దీనిపై బహిరంగ చర్చకి సిద్ధమని సవాల్ విసిరారు.

మతోన్మాద పార్టీలను ఓడించండి

వైరా: మతోన్మాద బీజేపీ, ఎంఐఎం పార్టీలు, వాటికి వత్తాసు పలుకుతున్న బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన ఎన్నికల అవగాహనపై జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోగా.. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి తన కుటుంబానికి వందల కోట్లు దోచిపెట్టుకున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, అర్జునరావు, అశోక్, కృష్ణ, అప్పారావు, శిరీష, దర్శ, బాబు, సీతారాములు, కృష్ణ, సోములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెగళ్లపాడులో ఆయుర్వేద వైద్యశిబిరం

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో పలు వ్యాధులతో బాధపడుతున్న 72 మంది రోగులకు డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ప్రతిరోజు ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ కిశోర్, హెచ్ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం స్నేహ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, పార్మాసిస్టు శ్రీను, సెక్రటరీ వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



గేదెకు టీకా వేస్తున్న వైద్యాధికారి మమత

కల్లూరు రూరల్: మండలంలోని రఘునాధబంజరులో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారి మమత ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎల్ఓ శ్రీనివాస్, జేవీఓ రాధాకృష్ణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, గోపాల మిత్రలు పి.వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, హనుమంతు, బివెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్ అప్పారావు శివకృష్ణ కోటేశ్వరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.